క్లుప్తంగా

అయ్యప్పకు పూజలు



జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం శ్రీ హరిహర సుత అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో ప్రసాత వితరణ చేశారు.

అమ్మవారికి సారె సమర్పణ

బుట్టాయగూడెం: స్థానిక శివాలయంలోని త్రిపుర సుందరీ అమ్మవారి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి మహిళా భక్తులు ఆషాఢం సారెను సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

దుర్గమ్మకు పూజలు



జంగారెడ్డిగూడెం: స్థానిక రామచంద్రపురం శ్రీ కోదండరామస్వామి ఉపాలయంలో దుర్గమ్మవారికి మూలా నక్షత్రం సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి అర్చకులు మద్దూరి సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. వల్లేపల్లి సుబ్బారావు, ధనలక్ష్మి దంపతులచే పంచామృత అభిషేకాలు నిర్వహించినట్టు ఆలయ కమిటీ తెలిపింది. మహిళా భక్తులచే లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు.

11న గంగానమ్మకు శాకంబరి అలంకరణ

జంగారెడ్డిగూడెం: ఆషాఢమాసం పురస్కరించుకుని ఈనెల 11వ తేదీ శుక్రవారం జంగారెడ్డిగూడెం గ్రామ దేవత గంగానమ్మవారిని శాకంబరిదేవిగా అలంకరించనున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది. ఈ సందర్భంగా గంగానమ్మకు బోనాలు సమర్పించనున్నట్టు బుధవారం పేర్కొంది.

అన్నసమారాధన


అన్నప్రసాద వితరణ చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక హైస్కూల్ వద్ద ఉన్న వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద బుధవారం అన్నప్రసాద వితరణ చేశారు. తొలుత స్వామివారికి విశేష పూజలు, అలంకరణ చేశారు. సుమారు 1500 మంది అన్నప్రసాదాన్ని స్వీకరించినట్టు ఆలయ కమిటీ తెలిపింది. అన్నప్రసాద వితరణకు శీలి ఉమామహేశ్వరి కుటుంబసభ్యులు, కోటగిరి గంగాధరరావు, లక్ష్మీప్రసన్న దంపతులు, కొమ్మసాని రవీందర్ రెడ్డి, తడికమళ్ల శ్రీనివాసరావు తదితరులు దాతలుగా వ్యవహరించినట్లు చెప్పారు.

శాస్త్రోక్తంగా చండీహోమం


చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక విజయదుర్గమ్మ ఆలయంలో అమ్మవారి జన్మనక్షత్రమైన మూలానక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం అర్చకులు శాస్త్రోక్తంగా చండీ హోమం నిర్వహించారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రాత్రి 8 గంటలకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. పట్టణ ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు గురుపౌర్ణమి వేడుకలు

జంగారెడ్డిగూడెం: స్థానిక పాతబస్టాండ్ ఎంబీ సోషల్ క్లబ్ ఆవరణలో శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం ఉదయం గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 4.30 గంటలకు కాకడ హారతితో పూజా కార్యక్రమాలు ప్రారంభమౌతాయన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని బాబావారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

నేడు అన్నప్రసాద వితరణ


సత్యనారాయణ స్వామి

లింగపాలెం: ఏలూరు జిల్లా లింగపాలెం మండలం రెండో అన్నవరంగా ప్రసిద్ధి చెందిన రంగాపురం గ్రామంలో శ్రీ భూనీల సహిత శ్రీ సత్యనారాయణ స్వామి సన్నిధిలో పౌర్ణమి పురస్కరించుకుని స్వామివారి కల్యాణ మహోత్సవం సందర్భంగా భక్తులకు గురువారం ఉదయం 11 గంటలకు అన్నప్రసాదం ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ తెలిపింది. భక్తులు స్వామి పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

సాగు సాయం కోసం ఎదురుచూపు

- ఏడాదికి రూ.20 వేలు హామీపై స్పందన కరువు
- ప్రభుత్వంపై రైతుల ఆగ్రహం
- వైఎస్సార్ సీపీ పాలనలో ఏటా రూ.13,500 అందుకున్న రైతులు


సాగుకు సిద్ధం చేసుకుంటున్న రైతు

బుట్టాయగూడెం: వ్యవసాయం అంటేనే గుర్తుకు వచ్చేది దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి. వైఎస్సార్‌కు తగ్గ తనయుడుగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తన పాలనలో రైతుల అభివృద్ధికి ఎనలేని కృషి చేసి రైతు పక్షపాతిగా నిలిచారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ సీపీ పాలనలో సకాలంలో వ్యవసాయానికి పెట్టుబడులకు రైతు భరోసా పథకంలో ప్రతి ఏటా రూ.13,500 అందజేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని అన్నదాత సుఖీభవ పథకంగా పేరు మార్చి తాము అధికారంలోకి వస్తే ఏటా రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల్లో ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా పెట్టుబడి సాయం అందకపోవడంతో రైతుల్లో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

32,669 హెక్టార్లలో పంటల సాగు

పోలవరం నియోజకవర్గంలో ఉన్న బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు, టి.నర్సాపురం, కొయ్యలగూడెం మండలాల్లో ప్రధాన పంటలు వరి, ప్రత్తి, మొక్కజొన్న వర్జీనీయా పొగాకు పంటలతో పాటు అపరాలు సాగు చేస్తున్నారు. గిరిజన ప్రాంతంలో కొండపోడు వ్యవసాయ చేస్తున్నారు. ఏటా పంటల సీజన్‌లో అధికారులు సాగు ప్రణాళికలు సిద్ధం చేసి సాగులో రైతులను ప్రోత్సహిస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ సంబంధించి అధికారులు నియోజకవర్గంలోని ఏడు మండలాల పరిధిలో సుమారు 32,669 హెక్టార్లలో పంటల సాగు ప్రోత్సహించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. అయితే ప్రస్తుతం వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. వ్యవసాయ పనులు రైతులు సిద్ధమవుతున్నారు. పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

వైఎస్ జగన్ పాలనలో మేలు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నవరత్నాల పథకాలు అమలులో భాగంగా రైతు భరోసా పథకాన్ని పక్కాగా అమలు చేశారు. అర్హులైన రైతులకు ప్రతి ఏటా వ్యవసాయ పెట్టుబడి సాయం కింద రూ.13,500 అందజేశారు. ఇచ్చిన మాట ప్రకారం క్యాలెండర్ తేదీ మేరకు మూడు దఫాలుగా రైతు భరోసా సొమ్ము నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమైంది. ఫలితంగా రైతులు అప్పుల బాధలు తప్పేవి. అర్హులైన రైతుల ఎంపిక అప్పట్లో వలంటీర్ల సహకారంతో జరిగేది. వలంటీర్లు ఇంటింటీ తిగిరి రైతుల వివరాలు సేకరించి రైతు భరోసా పథకంలో కోసం అవసరమైన చర్యలు చేపట్టేవారు.

పెట్టుబడి సాయం అందించాలి



కూటమి ప్రభుత్వం రైతులు ఇచ్చిన హామీ మేరకు వ్యవసాయనికి పెటుబడి సాయం అందిచాలి. ఇప్పటికే రైతులు వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్నారు. పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారు. సకాలంలో పెట్టుబడి సాయం అందకపోతే అనేక మంది రైతులు అప్పులపాలవుతారు.

– తెల్లం బాలరాజు, మాజీ ఎమ్మెల్యే, దుద్దుకూరు, బుట్టాయగూడెం మండలం

వైఎస్సార్ సీపీ జెండా ఎగరేస్తాం

ఏలూరు టౌన్: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాల సాధన, వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేయటమే లక్ష్యంగా ఏలూరు నియోజకవర్గంలో పార్టీ నేతలు, కార్యకర్తలు సమష్టిగా పనిచేస్తామని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ అన్నారు. వైఎస్సార్ సీపీ ఏలూరు కార్యాలయంలో బుధవారం పార్టీ నగర అధ్యక్షులు గుడిదేశి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో జయప్రకాష్ మాట్లాడారు. రాబోయే కాలంలో పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమాన్నీ విజయవంతం చేస్తామన్నారు.

వెంకటరెడ్డిగూడెంకు రోడ్డు లేక ఇబ్బందులు

పోలవరం రూరల్: పోలవరం మండలం వింజరం పంచాయతీ వెంకటరెడ్డిగూడెం గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఏజెన్సీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు మాట్లాడుతూ వెంకటరెడ్డిగూడెం గ్రామానికి సరైన రోడ్డు మార్గం లేక గిరిజనులు తీవ్ర అవస్థలు పడుతున్నారని చెప్పారు. గతంలో మంజూరైన రోడ్డును కూడా నిర్మించకపోవడంతో రోడ్డు గుంతల మయంగా మారి వర్షాకాలంలో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. తక్షణమే వింజరం నుంచి వెంకటరెడ్డి గూడెం, వెంకటరెడ్డిగూడెం నుంచి రామన్నపాలెం వరకు తారు రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్మెల్ పురం నుంచి వింజరం మీదుగా రేపల్లెవాడ వరకు దెబ్బతిన్న రోడ్డును కూడా వెంటనే నిర్మించాలని కోరారు. వెంకటరెడ్డిగూడెం పిసా కమిటీ ఉపాధ్యక్షుడు కొమరం రామారావు మాట్లాడుతూ తమ గ్రామం గుండా ప్రవహించే ఊట కాలవ పోలవరం ప్రాజెక్టు కాలవ వద్ద ఇసుక మేట వేయడంతో నీరు వెనక్కి తన్ని ఇళ్లల్లోకి నీరు వస్తుందని, పాములు, పురుగులు వస్తున్నాయని తెలిపారు. వెంటనే ఇసుక మేటను తొలగించాలని, ఊట కాలవపై బ్రిడ్జి నిర్మించాలని కోరారు. పిసా కమిటీ కార్యదర్శి చెదల శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీ భవనం సమస్యను పరిష్కారించాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రం ఎంపీడీఓ శ్రీనివాస్ బాబుకి అందజేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కార్యక్రమానికి ఏజెన్సీ గిరిజన సంఘ నాయకులు మడి వెంకటగిరి, కొమరం రామారావు, వలస బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో తనిఖీ


విద్యార్థులతో భోజనం చేస్తున్న విజయప్రతాప్ రెడ్డి

ద్వారకాతిరుమల: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల వంటశాల, స్టోర్ రూమ్‌లను రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ చిత్త విజయప్రతాప్ రెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. 682 మంది విద్యార్థులకు కేవలం నలుగురు మాత్రమే వంట చేసేవారు ఉన్నారని ప్రిన్సిపాల్ చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన సమస్యను పరిష్కరిస్తానని కృషిచేస్తానని చెప్పారు. ఆయన ఈ సందర్భంగా పిల్లలతో కలిసి భోజనం చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తనిఖీలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఆర్‌వీ నాగరాణి, పౌర సరఫరాల సంస్థ డీఎం శివరామమూర్తి, డీఎస్‌ఓ విలియమ్స్, విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, లీగల్ మెట్రాలజీ, ఫుడ్ సేఫ్టీ, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్ బస్సుల తనిఖీ


ప్రైవేట్ స్కూలు బస్సులను తనిఖీ చేస్తున్న అధికారులు

కామవరపుకోట: స్థానిక చెక్‌పోస్టు సెంటర్లో ప్రైవేట్ పాఠశాల బస్సులను అధికారులు బుధవారం తనిఖీ చేశారు. ఓ బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లో కిట్ లేకపోవడంతో కేసు నమోదు చేశామని జంగారెడ్డిగూడెం అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు కేడీవీ రవిగోపాల్, సీహెచ్ సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఇప్పటి వరకు జంగారెడ్డిగూడెం ఆర్టీఓ పరిధిలో ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, లైసెన్స్, డాక్యుమెంట్స్ ఫోర్స్‌లో లేని వారిపై 16 కేసులు నమోదు చేశామని తెలిపారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా స్కూల్ బస్సుకు ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, ఫైర్ సేఫ్టీ, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, అనుభవజ్ఞులైన డ్రైవర్‌తో పాటు క్లీనర్ తప్పకుండా ఉండేలా మెయింటెన్ చేయాలని యాజమాన్యాలకు సూచించారు.

మల్లారంలో తాటాకిల్లు దగ్ధం


మల్లారంలో దగ్ధమైన తాటాకిల్లు

వేలేరుపాడు: మండలంలోని మల్లారం గ్రామంలో విద్యుత్ షాట్ సర్క్యూట్ కారణంగా బుధవారం సాయంత్రం పద్దం సుందరయ్యకు చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. సుమారు రూ.లక్ష ఆస్తినష్టం సంభవించిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంట్లో ఉన్న టీవీ, ఫ్రిజ్, ఇతర విద్యుత్ పరికరాలన్నీ కాలిబూడిదయ్యాయని తెలిపారు.

పుస్తకాలు, పెన్నుల పంపిణీ


పిల్లలకు పుస్తకాలు, పెన్నులు అందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక పద్మ థియేటర్ సమీపంలో ఉన్న అమ్మ ప్రేమ స్వచ్ఛంద సేవా సంస్థ ఆశ్రమంలో పిల్లలకు డాంగే నగర్ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం భోజనాలు, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. దీనికి స్థానిక ఎన్టీఆర్ నగర్‌కు చెందిన గడ్డం మంగాయమ్మ కుమారులు శ్రీను, రాధాకృష్ణలు ఆర్థిక సాయం అందించారు. సంఘం వ్యవస్థాపకులు అమృతల రంగా, నేలపోలు ప్రభాకర్‌రావు, అధ్యక్ష కార్యదర్శులు కె.లక్ష్మణరావు, పఠాన్ బాజీ, ఉపాధ్యక్షులు ఎల్.శ్రీనివాస్, ఆశ్రమ నిర్వాహకులు రోజా రాణి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

కామవరపుకోట: స్థానిక సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ ఫీర్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. కామవరపుకోట మండల వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు పీటీఎం సమావేశం

కొయ్యలగూడెం : విద్యార్థులు, తల్లిదండ్రులతో మెగా పీటీఎం 2.0 సమావేశం పరింపూడి బాలికల హైస్కూల్లో గురువారం ఉదయం తొమ్మిది గంటలకు నిర్వహించనున్నట్టు హెచ్‌ఎం నిమ్మలూరి ఉమాదేవి తెలిపారు. విద్యార్థుల్లో విద్యా వికాసం, వివిధ అంశాలపై తల్లిదండ్రులతో చర్చించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల పనితీరుపై వారి అభిప్రాయాలను స్వీకరించనున్నట్టు పేర్కొన్నారు.

గుట్కాలు, సిగరెట్లు అమ్మితే చర్యలు



దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎస్సై చెన్నారావు

కామవరపుకోట: విద్యా సంస్థల సమీపంలో గుట్కాలు, సిగరెట్లు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని తడికలపూడి ఎస్సై పి.చెన్నారావు హెచ్చరించారు. ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్‌లో భాగంగా బుధవారం కామవరపుకోటలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పాఠశాలల సమీపంలో సిగరెట్లు అమ్ముతున్న దుకాణాలపై దాడులు చేశారు. జరిమానా విధించారు.

మద్యం పట్టివేత

కామవరపుకోట: మండలంలోని ఈస్ట్ యడవల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన దాడుల్లో మరీదు దుర్గారావుపై కేసు నమోదు చేసి, 180 ఎంఎల్ పరిమాణం గల 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని ఎక్సైస్ సీఐ పి.అశోక్ తెలిపారు. దాడుల్లో చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ ఎస్సై అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

గో సంరక్షణశాలకు దాణా విరాళం


గో సంరక్షణశాలలో దాణా లారీ

ద్వారకాతిరుమల: శ్రీవారి గో సంరక్షణశాలకు భక్తుడు, మూలపాడు గ్రామానికి చెందిన నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు బుధవారం 10 టన్నుల దాణాను విరాళంగా అందజేశారు. లారీలో తీసుకొచ్చిన దాణాను గో సంరక్షణశాలలోని అధికారులకు అప్పగించారు. దాతను అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం దాత స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

లేబర్ కోడ్‌లను ఉపసంహరించాలి


చింతలపూడి : నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘ నేతలు


జంగారెడ్డిగూడెం : సమ్మెను నిర్వహిస్తున్న కార్మికులు


కొయ్యలగూడెం : జాతీయ ప్రధాన రహదారిపై రాస్తారోకో


బుట్టాయగూడెం : ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

చింతలపూడి : కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి రూపొందించిన నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం చింతలపూడిలో నిర్వహించిన సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు స్థానిక బైపాస్ రోడ్డు నుంచి ఫైర్ స్టేషన్ సెంటర్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఏఐటీయూసీ జిల్లా నాయకులు తుర్లపాటి బాబు, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు నత్త వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో రవి, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు దొంత కృష్ణ, సీపీఐ మండల నాయకులు షేక్ కాలీషా మాట్లాడారు. గోద్రెజ్ ఫ్యాక్టరీ యూనియన్, అంగన్‌వాడీ యూనియన్, ఆశ వర్కర్స్ యూనియన్, వీవోఏల సంఘం, మెప్మా సంఘం నాయకులు పాల్గొన్నారు.

హామీలను విస్మరిస్తున్న ప్రభుత్వం

లింగపాలెం: ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం విస్మరిస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ విమర్శించారు. సమ్మెలో భాగంగా లింగపాలెం తహసీల్దార్ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు సెంటర్ వరకు సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. రాజశేఖర్, సంఘ నాయకులు, కార్మికులు, కూలీలు, రైతులు పాల్గొన్నారు.

హక్కులను కాలరాస్తున్న కేంద్రం

కొయ్యలగూడెం: కార్మికుల హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు డిమాండ్ చేశారు. కొయ్యలగూడెం ప్రధాన రహదారిపై సీపీఐ, ఏఐటీయూసీ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, రెడ్ స్టార్, ఏఐకేఎంఎస్, సీపీఎం, సీఐటీయూ, ఇఫ్టూ ఆధ్వర్యంలో ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. పంచాయతీ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ పోలా రావులమ్మ, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకుల ఎస్‌కే రషీద్ మాట్లాడారు.

కేంద్రంపై కార్మిక సంఘాల ఆగ్రహం

వేలేరుపాడు: పోరాటాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను హరిస్తూ కేంద్రంలోని మోదీ సర్కారు నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడాన్ని నిరసిస్తూ మండలంలోని వివిధ కార్మిక సంఘాలు వేలేరుపాడులో భారీ ర్యాలీ నిర్వహించాయి. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండీ మునీర్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి కారం దారయ్య, మండల కార్యదర్శి బాడిశ రాము, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను అమలు చేయాలి

టి.నరసాపురం: టి.నరసాపురంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి అనుమోలు మురళి, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమండ్ చేశారు. సీఐటీయూ నాయకులు విజయలక్ష్మి, ఝాన్సి, వర్కర్స్ యూనియన్ నాయకులు, ఆశ, అంగన్‌వాడీ, మిడ్‌డే మీల్స్, రవాణా సంఘం కార్మికులు పాల్గొన్నారు.

ఉరితాళ్లతో ప్రదర్శన

జంగారెడ్డిగూడెం: ఉద్యోగ కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు రద్దు చేసే వరకు ఉద్యమిస్తామని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. జంగారెడ్డిగూడెంలో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ అనుబంధ ప్రజా సంఘాలు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సంఘాల ఆధ్వర్యంలో వందలాది మందితో బస్టాండ్‌లో మానుకొండ జీవరత్నం, కె.విగ్నేష్, ఏరుబండి వీర్రాజు అధ్యక్షతన సభ నిర్వహించారు. నాయకులు వి.వెంకటేశ్వరరావు, కేవీ రమణ, కుంచె వసంతరావు, ఎస్‌కే సుభాషిణి, పి.సూర్యారావు, జేవీ రమణ రాజు, మొల్లేటి శ్రీనులు మాట్లాడారు. లేబర్ కోడ్లు ఉద్యోగ కార్మికులకు ఉరితాడ్లు అని నాలుగు ఉరితాళ్లు కట్టుకొని ప్రదర్శన చేశారు. సమ్మెలో భాగంగా ఎల్ఐసీ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. కార్యదర్శి జె.నరేంద్రబాబు, ప్రెసిడెంట్ వరహాలరావు, సభ్యులు పాల్గొన్నారు.

పోలవరంలో ప్రదర్శన, రాస్తారోకో

పోలవరం రూరల్: పోలవరం గంగాభవాని థియేటర్ నుంచి ఏటుగట్టు వరకు ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుజం రామారావు అధ్యక్షతన నిరసన ప్రదర్శన, రాస్తారోకో నిర్వహించారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ బాషా, ఆదివాసి గిరిజన సంఘం కార్యదర్శి కారం భాస్కర్‌లు మాట్లాడారు. సమ్మెకు పోలవరం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సొబ్బన రాజశేఖర్ బాబు సంఘీభావం తెలిపారు. అఖిల భారత రైతు కూలీ సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి పోరండ్ల శ్రీనివాస్ నాయకత్వంలో పోలవరం పంచాయతీ కార్యాలయం నుంచి మసీదు సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

బుట్టాయగూడెం: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏఐకేఎమ్ఎస్ జిల్లా నాయకులు కారం రాఘవ కోరారు. బుట్టాయగూడెంలో ఆ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. నాయకులు వెట్టి భారతి, తగరం బాబూరావు, వడ్లమూడి వెంకటేశ్వరరావు, బన్నే వినోద్, సర్పంచ్ కారం లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పని గంటల పెంపు దారుణం

కుక్కునూరు: వేతనాలు పెంచకుండా పని గంటలు పెంచడం, లేబర్ కోడ్‌లను తీసుకురావడం దారుణమని సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్, ఏఐవీకేఎస్ జిల్లా సహాయ కార్యదర్శి సోయం చంద్రరావు అన్నారు. సీఐటీయూ, ఏఐవీకేఎస్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘం, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ద్వారకాతిరుమల: కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని కోరుతూ కార్మికులు ద్వారకాతిరుమలలో ర్యాలీ నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ సెంటర్‌లో మానవహారం, అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఆదికృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఆందోళనలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు, సీఐటీయూ మండల నాయకుడు పెద్దిరాజు మాట్లాడారు. సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, డీవైఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.